
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్టం 31.4 కనిష్టం 19.5

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్ జిల్లా వార్తలు

5

శనివారం 16 నవంబరు 2024





కొనుగోళ్లు మొదలైనా..
రైతులకు తప్పని తిప్పలు!

- కొనుగోళ్ల కోసం రోజుల తరబడి వేచి చూస్తున్న జిల్లా రైతులు
- బోనస్ కోసం కొనుగోలు కేంద్రాల్లో అమ్మేందుకు మొగ్గు
- జిల్లాలో 670 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు
- ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రూ.106 కోట్ల జమ
- ధాన్యం కొనుగోళ్ల తర్వాత సన్నరకాల బోనస్ పంపిణీ

నిజామాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను మొదలుపెట్టినా రైతులకు తిప్పలు తప్పడం లేదు. తూకం కోసం రోజుల తరబడి ఎదురు చూస్తున్నారు. ఒకేసారి రైతులందరూ వరి కోతలను మొదలుపెట్టడంతో భారీఎత్తున ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. జిల్లాలోని మెజార్టీ గ్రామాల పరిధిలో ధాన్యాన్ని రోడ్లపైనే ఉంచి అమ్మేందుకు రైతులు చూస్తున్నారు. జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతీరోజు సన్నరకాలతో పాటు దొడ్డు రకాలను కొనుగోలు చేస్తున్న ఒకేసారి భారీ ఎత్తున ధాన్యం రావడం వల్ల సాధ్యం కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో 12లక్షల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కొనుగోళ్ల ఆలస్యం కావడంతో రైతులు మూడున్నర లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని ప్రైవేటుకే అమ్మకాలను చేశారు. 15 రోజుల క్రితం జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను మొదలుపెట్టిన అధికారులు ప్రతీరోజు 20వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేస్తున్నారు. ట్యాబ్ ఎంట్రీ చేసి రైతుల ఖాతాల్లో మద్దతు ధర ప్రకారం డబ్బులను జమ చేస్తున్నారు. ఈ నెలా ఖరులోపు 5లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ప్రత్యేక అధికారులను నియమించి కొనుగోలు వేగవంతం అయ్యేందుకు చర్యలను చేపట్టారు.

నెలన్నర ముందే కోతలు

జిల్లాలో వరి కోతలను నెలన్నర ముందే రైతులు మొదలుపెట్టారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకున్నా జిల్లా వ్యాప్తంగా ధాన్యాన్ని రైతులు ఎక్కువ మొత్తంలో వ్యాపారులకు అమ్మకాలు చేశారు. సన్నరకాలను బోనస్ కోసం ఈ సీజన్‌లో ఎక్కువగా సాగు చేసిన రైతులు కొనుగోలు కేంద్రాలు ఆలస్యం కావడంతో పచ్చిధాన్యం ఎక్కువమొత్తంలో వ్యాపారులకు అమ్మకాలు చేశారు. క్వింటాలుకు 2100 నుంచి 2300ల వమధ్య అమ్మారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన తర్వాత సన్నరకాలకు వ్యాపారులు కూడా ధరపెంచి కొనుగోలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు మూడున్నర లక్షల మెట్రిక్ టన్నుల వరకు వ్యాపారులు మిల్లర్లుగా కొనుగోలు చేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కొనుగోళ్లను వేగవంతం చేశారు. సన్నరకాలు వేసిన రైతులు బోనస్ వస్తుందని నమ్మకంతో ఎక్కువ రోజులు ధాన్యాన్ని నిల్వ ఉంచారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యం కావడంతో నెలరోజులుగా రోడ్లపైనే ధాన్యం ఉంచి వేచి చూస్తున్నారు. ప్రతీరోజు కొనుగోలు కేంద్రాల్లో వంద నుంచి 500 మెట్రిక్ టన్నుల వరకే కొనుగోలు చేస్తుండటంతో చాలా గ్రామాల రైతులు అమ్మకానికి వేచి చూస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులతోపాటు పెద్దరైతులు కూడా ధాన్యాన్ని ఆరబోసేందుకు భారీగా ఖర్చు పెడుతున్నారు. ధాన్యం పోసేందుకు కల్లాలు, ఇతర ఏర్పాట్లు లేకపోవడం వల్ల రోడ్లపైనే నిలువ ఉంచి వేచి చూస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 670 కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో 15 రోజుల క్రితం ధాన్యం కొనుగోలు అధికారులు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా 670 కేంద్రాలను ఏర్పాటుచేశారు. సన్నరకాలతోపాటు దొడ్డు రకాలకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేసి కొనుగోళ్లను చేస్తున్నారు. ధాన్యం నిల్వలు చాలా గ్రామాల పరిధిలో పేరుకుపోవడం ఎక్కువ మంది రైతులు అమ్మకాలు సిద్ధంగా ఉండటంతో ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రత్యేక అధికారులను నియమించి కొనుగోలు చేస్తున్నారు. నిత్యం 15వేల నుంచి 20వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరిస్తున్నారు. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని కొంటుండగా మరికొన్ని కేంద్రాల్లో తక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. చలి పెరగడం తేమ శాతం ఉండటంతో 17లోపు ఉన్న వాటిని కొనుగోలు చేస్తున్నారు. రైతులు రోజుల తరబడి ఆరబోసిన తేమశాతం మాత్రం తగ్గడం లేదు. రోడ్ల వెంట ధాన్యం కుప్పలను నిల్వ ఉంచుతున్న రైతులు ఆరబోసి కేంద్రాలకు తీసుకువస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 2లక్షల 36వేల 500 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈనెలాఖరులోపు 5లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్ణయించారు.

జిల్లావ్యాప్తంగా 231 మిల్లుల గుర్తింపు

జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయిస్తున్నారు. మిల్లర్లు ఇచ్చేగ్యారంటీకి అనుగుణంగా జిల్లావ్యాప్తంగా 231 మిల్లులను గుర్తించి కేటాయింపులను చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు ఒకటి రెండురోజుల్లోనే కేటాయించిన మిల్లులకు ధాన్యాన్ని చేరేలా చూస్తున్నారు. ప్రతీ కేంద్రం వద్ద ధాన్యం నిల్వలు ఎక్కువగా ఉండటంతో గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచడంతో పాటు హమాలీల ద్వారా వెంట వెంటనే నింపుతూ వాహనాల ద్వారా (...మిగతా 8వ పేజీలో)

ఘనంగా గురునానక్ జయంతి

- గురుగ్రంథీల ఊరేగింపు
- పాల్గొన్న నుడా చైర్మన్
- శోభాయాత్రలో ఆకట్టుకున్న సిక్కుల విన్యాసాలు



6

బస్సు ఎక్కాలంటే ఎన్ని కష్టాలో..

- కోటగిరిలో ప్రయాణికులకు తప్పని తిప్పలు
- శిథిలావస్థలో బస్టాండ్ భవనం
- నీడ కనీసం సౌకర్యం లేక అవస్థలు



7



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నమో నింబగిరీశా..

- కన్నుల పండువగా రథోత్సవం
- జాతరకు పోటెత్తిన భక్తజనం
- హాజరైన ప్రముఖులు
- భారీ పోలీసు బందోబస్తు

భీంగల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భీంగల్ మండలంలోని లింబాద్రిగుట్టపై శ్రీలక్ష్మీ నృసింహ స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా కార్తీకపౌర్ణమి శుక్రవారం నిర్వహించిన రథోత్సవం కన్నుల పండువగా సాగింది. వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణతో శ్రీ నింబాచల క్షేత్రం పులకించిపోయింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త నంబి పార్థసారథి, విజయసారథి, వాసుదేవాచార్యులు వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి రథ ప్రతిష్ఠ జరిపారు. పురోహితులు శ్రీమన్నారాయణుడికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మంగళవాయిద్యాలు, గోవిందనామాలతో రథభ్రమణమును గావించారు.

రథోత్సవంలో ప్రముఖులు

లింబాద్రి క్షేత్రంపై నిర్వహించిన రథోత్సవంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, తెలంగాణ మినరల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ ఈరవత్రి అనిల్, కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దోళ్ల గంగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ప్రేమలత, ఆయా పార్టీల నాయకులు తదితరులున్నారు.

బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

నింబాచల క్షేత్రంలో రథోత్సవం సందర్భంగా పోలీసులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీబందోబస్తు ఏర్పాటుచేశారు. దర్శనానికి వెళ్లే దారిలో పకడ్బందీ చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ జామ్ కాకుండా ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించంలో పోలీసులు విఫలమయ్యారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. ఈ విషయం డీజీపీ, సీపీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.



స్వామివారిని భక్తులకు చూపుతున్న పురోహితులు





హాజరైన బాల్కొండ, ఆర్మూర్ ఎమ్మెల్యేలు



భక్తిశ్రద్ధలతో కార్తీకపూజలు


- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఇంటింటా తులసీ కల్యాణాలు, సత్యనారాయణ వ్రతాలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయాల్లో, ఇండ్లల్లో తులసీ కళ్యాణాలు, సత్యనారాయణ వ్రతాలు చేశారు. కార్తీక ఏకాదశిని మొదలుకొని పౌర్ణమి వరకు నిర్వహించే ప్రత్యేక పూజలు ఆలయాల్లో చివరిరోజు అభిషేకాలతో పాటు అర్చనలు, అన్నదానాలు నిర్వహించారు. పలు ఆలయాల్లో యజ్ఞ కార్యక్రమాలను జరిపారు. నదీతీర ప్రాంతాల్లో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించి నదిలో దీపాలను వదిలారు. జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయం, జెండా బాలాజీమందిర్, గోల్‌హనుమాన్, నీరుగొండ హనుమాన్, అయ్యప్ప దేవాలయం ఆలయాల్లో కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెండా బాలాజీ మందిర్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదనపు కలెక్టర్‌కు ఆలయ అర్చకులు వెలగలేటి నాగరాజచార్య శేషవస్త్రాన్ని అందజేశారు. నగరంలోని గోల్‌హనుమాన్ దేవాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు.



ఆలయాల్లో దీపాలు వెలిగిస్తున్న భక్తులు










గాడి తప్పుతున్న పోలీసుశాఖ!



- వివాదాస్పదమవుతున్న కొంతమంది పోలీసు అధికారుల తీరు
- 10 రోజుల్లోనే ఏసీబీకి పట్టుబడిన ఇద్దరు మండల స్థాయి పోలీసు అధికారులు
- ఉమ్మడి జిల్లా పరిధిలో 20మంది అధికారులపై నివేదిక ఇచ్చినా చర్యలు లేవు
- ఇసుక, మట్టి, రేషన్ బియ్యం అక్రమ రవాణాల్లో కొంతమంది అధికారుల ప్రమేయం
- పైరవీల ద్వారా అనుకున్న పోస్టులకు బదిలీపై వస్తున్న అధికారులు
- నిక్కచ్చిగా వ్యవహరించే అధికారులకు లూప్‌లైన్ పోస్టింగ్‌లు

నిజామాబాద్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శాంతిభద్రతలు పర్యవేక్షించే పోలీసు శాఖ ఉమ్మడి జిల్లాలో గాడి తప్పుతుంది. క్రమశిక్షణకు మారుపేరు అయిన ఈశాఖలో కొంత మంది అధికారులు, ఉద్యోగుల తీరు వివాదాస్పదమవుతుంది. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించడంతోపాటు శాంతిభద్రతలను పర్యవేక్షించాల్సిన కొంతమంది అధికారులు చేస్తున్న తీరుతో నమ్మకం పోతోంది. పనుల కోసం లంచాలు డిమాండ్ చేస్తూ ఏసీబీకి పట్టుబడుతుండటం కలకలం రేపుతుంది. ఎస్సై స్థాయి నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు కొద్దిమంది అధికారులు అనుసరిసున్న తీరు వల్ల 10 రోజుల్లోనే ఇద్దరు అధికారులు ఏసీబీకి పట్టుబడగా ఉమ్మడి జిల్లా పరిధిలో సంచలనం రేపింది. పోలీస్ బదిలీల నుంచి పోస్టింగ్‌ల వరకు వివాదాస్పదం అవుతుండగా నిఘా వర్గాలు ఇచ్చిన నివేదికలు కూడా ఉన్నతస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల వల్ల పట్టించుకోకపోవడంతో ఇష్టారాజ్యం అవుతుంది. ఇసుక నుంచి మట్టి వరకు, మట్కా నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా వరకు కొన్ని స్టేషన్ల పరిధిలో మామూళ్లు వసూలుచేస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. పూర్తిస్థాయి కకమిషనర్ లేకపోవడం, పర్యవేక్షణ ఉన్న చోట కూడా ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో అనుకున్న పోస్టులు పొందుతున్న కొంత మంది అధికారుల తీరు వల్ల ప్రజల్లో నమ్మకం పోతుంది. వివాదాస్పదమైన అధికారులపై ఉన్నతాధికారులతోపాటు ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ఈ పరిస్థితులు ఉండేవి కావు.

ఏసీబీకి చిక్కిన ఇద్దరు ఎస్సైలు

ఉమ్మడి జిల్లా పరిధిలో వారం రోజుల్లోనే ఇద్దరు ఎస్సైలు ఏసీబీకి పట్టుబడ్డారు. స్టేషన్ బెయిల్ కోసం లంచం తీసుకుంటుండగా వీరిని పట్టుకున్నారు. వీరితోపాటు కిందిస్థాయి ఉద్యోగులు కూడా పట్టుబడ్డారు. ఇవే కాకుండా పలు వివాదాల్లో కొంతమంది అధికారులు తలదూర్చారు. ఉన్నతాధికారుల నుంచి షోకాజ్ నోటీసులను అందుకున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో కొన్ని కీలకమైన పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయి. వీటి పరిధిలో ఇసుక నుంచి మట్టి వరకు అక్రమరవాణా కొనసాగుతోంది. ఇవే కాకుండా సరిహద్దుల గుండా రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. వివాదాస్పద భూముల గొడవలు కూడా వీరికి కలిసివస్తోంది. కొన్నికేసుల్లో స్టేషన్‌బెయిల్ ఇస్తారు. ఏడు సంవత్సరాలలోపు వాటికి ఈ బెయిల్‌లను మంజూరు చేస్తున్నారు. ఈ కేసులు పోలీసులకు ఆదాయ వనరుగా మారింది. ఇవే కాకుండా వివాదాస్పద భూముల్లో కేసులు నమోదు చేయకున్నా కొంత మంది బిల్డర్లు అమ్మకం దారుల వల్ల వీరికి కలిసి వస్తోంది. ఆ కేసుల్లో డబ్బులను తీసుకొస్తోంది. ఉమ్మడి జిల్లాపరిధిలో పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తున్న ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు, వారి సిఫారసుల మేరకే ఎక్కువగా పోస్టింగ్‌లను పొందుతున్నారు. కొంతమంది భారీఎత్తున డబ్బులు ఖర్చు పెట్టి వస్తున్నారు. వచ్చిన తర్వాత పెట్టిన డబ్బును సంపాదించుకునేందుకు రకరకాల వివాదాల్లో తలదూర్చడమే కాకుండా ఎక్కువమొత్తంలో వసూళ్లు చేస్తున్నారు. ఏసీబీకి పట్టుబడిన ఎస్సైల కేసుల్లో ఇవే విషయాలను నమోదు చేశారు. కొంతమంది అధికారుల పనితీరుపైన నాలుగు నెలల క్రితమే ఉన్నతాధికారులకు నిఘావర్గాలు నివేదికను అందించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు 20 మంది అధికారుల వరకు ఉన్నారు. వీరికి సంబంధించిన వివరాలను అందించగా నోటీసులను కూడా జారీ చేశారు. కొంత మంది అధికారులను బదిలీ చేసిన నేతలను పట్టుకొని ఉమ్మడి జిల్లా పరిధిలోని స్టేషన్‌లలోనూ పోస్టింగ్‌లు వచ్చే విధంగా చూసుకున్నారు. గతంలో పనిచేసిన సీపీతో పాటు కామారెడ్డి ఎస్పీ కూడా పూర్తిస్థాయిలో నిఘా పెట్టడమే కాకుండా పనిచేసే అధికారులకే పోస్టింగ్‌లు ఇచ్చే విధంగా చూశారు. అయినా కొంతమంది అధికారులు బదిలీ అయిన తర్వాత కూడా పెద్ద ఎత్తున పైరవీలను చేసి పోస్టింగ్‌లను తెచ్చుకున్నారు. కొంత మందిని ఇతర జోన్‌లకు బదిలీ చేసిన ఒకటి (...మిగతా 8వ పేజీలో)

వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు


ఉప్లూర్ బాల రాజరాజేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


వెంచిర్యాల్‌లో బంగారు వెంకన్న ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు


కొత్తపల్లి శివాలయంలో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు

కమ్మర్‌పల్లి, నవంబరు 15: (ఆంధ్రజ్యోతి): మండలంలో కార్తీక పౌర్ణమి పర్వదిన వేడుకలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. శుక్రవారం తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని మహిళలు ప్రత్యేక పూజల్లో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో తులసీ చెట్టుకు ప్రత్యేక పూజ లు, సత్యనారాయణ వ్రతాలు, అభిసేకాలతో దైవదర్శనాలు పొందారు. అనంతరం వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. కార్తీక మాసంలో శివుడికి అత్యంత ప్రీతికరమైన మాసం కావడంతో మండలంలో ఉప్లూర్ గ్రామంలో శ్రీబాలరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆర్చకులు పవన్ పంతులు అధ్వ ర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

ముప్కాల్: ముప్కాల్ మండలం వెంచిర్యాల్ గ్రామంలో బంగారు వెంకన్న ఆలయంలో కార్తికపౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆర్యసమాజ్ నిర్వాహకులు రాజారాం ఆధ్వర్యంలో మహాయజ్ఞం నిర్వహించారు.

పెర్కిట్: ఆర్మూర్ పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం కార్తికమాసం మహిళలు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. జక్రాన్‌పల్లి, తొర్లికొండ, అర్గుల్, మునిపల్లి గ్రామాల్లోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయాల్లో, వివిధ గ్రామాల్లో ఆలయాలలో మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

మోర్తాడ్: మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం కార్తికపౌర్ణమి సందర్భంగా శివాలయాలలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పురాతన రాజరాజేశ్వరస్వామి ఆలయంలో వందలాది మంది మహిళలు భారీ ఎత్తున పూజలు నిర్వహించారు. ఒడ్యాట్ శివాలయంలో మహిళలు దీపాలు వెలిగించారు.

ధర్పల్లి: మండలంలో కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా తులసీ చెట్టుకు ప్రత్యేక పూజలు, సత్యనారాయణ వ్రతాలు చేసి తమ మొక్కులను తీర్చుకొని వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. మండల కేంద్రంలో జరిగిన కార్తీక పౌర్ణమి వేడుకల్లో మాజీ ఎంపిపి సారిక హన్మంత్‌రెడ్డి మహిళలతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

బోధన్‌రూరల్: పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంతో పాటు మారుతి మందిరంలో కార్తీక మాస పౌర్ణమి సందర్భంగా దీపోత్సవం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర మందిరంలో కార్తీక లక్ష దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. మారుతి మందిరంలో లక్ష వత్తుల దీపోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. దీపోత్సవం కార్యక్రమంలో వందలాది భక్తులు పాల్గొన్నారు. ఓంకార నాదాలు, అర్చకుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, వేద పండితులు గణేష్ మహరాజ్, ప్రవీణ్ మహరాజ్, మహేష్ పాఠక్, మారుతి మందిరం ఆలయ కమిటీ చైర్మన్ గుండెటి శంకర్, శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, ఈవో రాములు, మహిళలు, భక్తులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

కోటగిరి: ఉమ్మడి మండలంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలను మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. పొతంగల్ మండల కేంద్రంలోని బాలాజీ మందిరంలో దీపారాధన కార్యక్రమాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోటగిరి విఠలేశ్వర మందిరం, ఎత్తొండలోని శివాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

నవీపేట: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మండలంలో తులసి పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు తులసి కోటలో ఉసిరి కొమ్మలను ఉంచి పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు, రుక్మిణి దేవిల కల్యాణం నిర్వహించారు. అనంతరం మహిళలు ముత్తైదువులకు వాయినాలు అందించి ఆశీస్సులు పొందారు.

డిచ్‌పల్లి: మండలంలోని బస్టాండ్ వద్ద శివాలయంతో పాటు ధర్మారం వెంకటేశ్వర ఆలయంలో, ఏడవ బెటాలియన్‌లోని వెంకటేశ్వర ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ ఇళ్ల వద్ద తులసీ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ వెంకటేశ్వర ఆలయంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.

ఘనంగా విఠలేశ్వర స్వామి ఆలయంలో పూజలు

నవీపేట: మండలంలోని యంచ చారిత్రక విఠలేశ్వర ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా గ్రామ శివారులో గుట్టపై కొలువైన శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి, రుక్మిణి దేవిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత వారం రోజులుగా ఆలయంలో కొనసాగుతున్న శ్రీ అఖండ హరినామ సప్తాహ ఉత్సవాలు శుక్రవారం రాత్రితో విజయవంతంగా ముగిశాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పొరుగున ఉన్న నిర్మల్ జిల్లాకు చెందిన భజన, వీణా కళాకారులు నిర్వహించిన కీర్తనలు, ప్రవచనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు పోశెట్టి పాల్గొన్నారు.


యంచ విఠలేశ్వర ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న భజన

బినోల గోదావరికి మహా హారతి

నవీపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోల గోదావరికి శుక్రవారం రాత్రి మహ హారతి కార్యక్రమం నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా స్థానిక గోదావరి పుష్కర ఘాట్ వద్ద గోదావరి తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహ హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులతో గోదావరికి తరలివచ్చారు. అనంతరం గోదావరి నది వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు కృష్ణ ప్రసాద్ జోషి, గోదావరి మహ హారతి కమిటీ జిల్లా అధ్యక్షులు రచ్చ తిరుపతి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


ఒడ్యాట్ శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు


జక్రాన్‌పల్లిలో లక్ష్మీనర్సింహస్వామికి పూజలు చేస్తున్న భక్తులు


పోతంగల్ బాలాజీ మందిరంలో దీపారాధన చేస్తున్న మహిళలు


ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్ బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

ఆర్మూర్ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ గురువారం అర్ధరాత్రి ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని బెంచీలు, కుర్చీలపై పలువురు నిద్రిస్తుండడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. దూరప్రాంతాలకు వెళ్లే వారు బస్సుల కోసం వేచి ఉంటే బస్టాండ్ ఒక పక్క విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ విషయమై స్థానిక ఆర్టీసీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. బస్టాండ్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పోలీసుల నిఘా ఉంటుందా అని అడిగితెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వరండాలో చెత్త సంచులు చూసి ఆసుపత్రిలో చెత్త పెట్టడం ఏంటని సిబ్బందిని ప్రశ్నించారు. డిస్‌పోజల్, ఇతర చెత్తను డస్ట్‌బిన్‌లో వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో ఉన్న డ్యూటీ డాక్టర్ సిబ్బందితో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోకి మధ్య తరగతి, పేదవారే ఎక్కువ వస్తారని, వారికి మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

అసిస్టెంట్ లైన్‌మెన్‌పై మహిళ దాడి

బోధన్‌రూరల్,నవంబరు15(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో అసిస్టెంట్ లైన్‌మెన్ నవీన్‌పై మహిళ దాడి చేసింది. ఈ ఘటనలో లైన్‌మెన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విద్యుత్ అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మీటర్ల పరిశీలన కోసం నవీన్ ఊట్‌పల్లి గ్రామానికి వెళ్లాడు. అయితే గ్రామంలోని ఓ మహిళ తన ఇంట్లో అక్రమంగా విద్యుత్‌ను వాడుతుందని తెలియడంతో వెళ్లి తొలగిస్తుండగా ఆగ్రహంతో ఆమె అతనిపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన నవీన్‌ను విద్యుత్ యూనియన్ అధికారులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అసిస్టెంట్ లైన్‌మెన్ నవీన్ ఫిర్యాదు మేరకు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడి చేసిన మహిళతో పాటు ఆమె కుమారుడిపై కూడా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామన్నారు.

బైక్, ట్రాక్టర్ ఢీకొనడంతో వ్యక్తి మృతి


బైక్, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన సోలం గంగాధర్

ఆర్మూర్‌టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి శివారులో బైక్, ట్రాక్టర్ ఢీకొని శుక్రవారం జక్రాన్‌పల్లి మండలం కేశ్‌పల్లి గ్రామానికి చెందిన సోలం గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కొన్ని నెలల క్రితం కోటగిరి మండలం పోతంగల్ గ్రామానికి చెందిన సోలం గంగాధర్ బతుకుదెరువు కోసం కేశ్‌పల్లి గ్రామంలో నివాసముంటున్నాడు. శుక్రవారం ఆర్మూర్‌లో పనులు ముగిం చుకొని బైక్‌పై కేశ్‌పల్లికి వెళ్తుండగా తొర్లికొండ ఎక్స్‌రోడ్డు వద్ద ఓ ట్రాక్టర్ అతివేగంగా బైక్ ఢీకొట్టడంతో గంగాధర్ బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై ఇంద్రకరణ్‌రెడ్డి సిబ్బందితో చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి

డొంకేశ్వర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామంలో శుక్రవారం ఒకరు అనుమానస్పదంగా మృతి చెందారు. దత్తాపూర్ గ్రామానికి చెందిన పొల్కం గంగాధర్ సాయంత్రం 4గంటల సమయంలో ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మృతుడి భార్య లక్ష్మీతో గత కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయని మృతుని సోదరుడు భోజన్నఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడిని భార్య లక్ష్మీ వేధించడం వల్లే మృతి చెంది ఉంటాడని మృతుని సోదరుడు భోజన్న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించేది.. కాంగ్రెస్ ప్రభుత్వమే

ఏర్గట్ల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కరించేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కాంగ్రెస్ నాయకులు ఇటీవలే బాధ్యతలు చేపట్టిన గడుగు గంగాధర్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగానికి సహకరిస్తూ, రైతులకు అందుబాటులో ఉంటూ, రైతుల సమస్యలు తెలుసుకొని వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే నూడ చైర్మన్ కేశవ్ వేణును కలిసి శాలవాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు సోమ దేవరెడ్డి, మాజీ ఎంపిటీసి గడ్డం లింగారెడ్డి, దేశబోయిన చిన్న సంజీవ్‌లు పాల్గొన్నారు.

ఇంటింటి కుటుంబ సర్వే పరిశీలన

రెంజల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో ప్రభుత్వం చేపడుతున్న ఇంటింటి కుటుంబ సర్వేను శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణ కోసం సర్వే తీరును పరిశీలించారు. సర్వే ఫారంలోని ప్రశ్నావళి ప్రకారం నిర్ణీత నమూనాలలో సమాచారాన్ని తప్పులు లేకుండా సరి చేయాలని ఎన్యూమరేటర్లకు సూచించారు.

నేటి నుంచి అయ్యప్పస్వాములకు భిక్ష

ఆర్మూర్‌టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై అయ్యప్ప ఆలయంలో శనివారం నుంచి అయ్యప్ప స్వాములకు 41రోజుల పాటు ఉచిత భిక్ష నిర్వహిస్తున్నట్టు అయ్యప్ప ఆలయ నిర్మాణకర్త అయ్యప్ప శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప మాల ధరించిన భక్తులు భిక్షను వినియోగించు కోవాలని ఆయన కోరారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఆర్మూర్‌టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో ఈనెల 13న గుర్తుతెలియని శవం లభ్యం కావడంతో మృతునికి సంబంధించిన ఎవరు రాకపోవడంతో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి మున్సిపల్ కార్మికులచే అంత్యక్రియలు నిర్వహించినట్టు ఏఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న సునీల్‌కుమార్

ముప్కాల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కుందారపు శ్రీనివాస్ వారి తండ్రి అనారోగ్యంతో మరణించడంతో శుక్రవారం నిర్వహించిన అంత్యక్రియల్లో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుల పాల్గొన్నారు.

గ్రూప్-4లో సత్తాచాటిన రెంజల్ యువకులు


రాథోడ్ పవన్ కుమార్


వెల్మల శివకుమార్


పాశం అనిల్

రెంజల్, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గురువారం గ్రూప్-4 ఫలితాల ప్రకటనలో మండలానికి చెందిన యువకులు సత్తాచాటారు. మండలంలోని మౌలాలి తండా గ్రామానికి చెందిన రాథోడ్ పవన్ కుమార్ మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ పోటీ పరీక్షలకు సన్నద్ధమై గ్రూప్-4 పరీక్ష రాయగా మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన వెల్మల శివకుమార్ కమర్షియల్ ట్యాక్స్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. పాశం అనిల్ మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. మండలానికి చెందిన యువకులు గ్రూప్-4లో ఎంపికవ్వడంతో మండల నాయకులు అభినందించారు. యువత కష్టపడితే సాధించలేనిది ఏది లేదని, కష్టపడ్డవారు విజయాన్ని సాధిస్తారని అన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని యువత పోటీ పరీక్షలకు సన్నద్ధమైన ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు.

ఘనంగా గురునానక్ జయంతి ఉత్సవాలు

- గురుగ్రంథ్‌ల ఊరేగింపు
- పాల్గొన్న నుడా చైర్మన్ కేశ వేణు


దర్శించుకున్న నుడా చైర్మన్


గురుగ్రంథ్‌ల ఊరేగింపు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గురునానక్ 555 జయంతి ఉత్సవాన్ని ఘనంగా సిక్కులు నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గురుద్వార్ ప్రబంధ కమిటీ ఆధ్వర్యంలో గురునానక్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిక్కు గురువులు గురుగ్రంథ్‌లను పఠించారు. నాందేడ్‌తో పాటు ప్రముఖ గురుద్వార్‌ల నుంచి ప్రత్యేక ప్రతినిధులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలు చేశారు. ఉదయం ప్రారంభమైన మధ్యాహ్నం వరకు కొనసాగాయి. గురు ద్వార్‌లో జరిగిన ప్రత్యేక పూజలో నుడా చైర్మన్ కేశ వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిక్కులు ఎంతో గొప్పగా చేసుకునే పండుగ గురునానక్ జయంతి అని అన్నారు. గురునానక్ చూపిన బాటలో పయనించి సిక్కుల ఐక్యతను చాటుకోవాలని అన్నారు. అనంతరం నిర్వహించిన లంగర్ (అన్నదానం)లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

గురుగ్రంథ్‌ల ఊరేగింపు

సిక్కుల ఆరాధ్య దైవమైన గురునానక్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని గురుగ్రంథ్‌లను నగరంలోని పలు వీధుల గుండా ఊరేగించారు. గురుద్వారా వద్ద గురుగ్రంథ్‌లను ప్రత్యేక పూజలు నిర్వహించిన సిక్కులు శోభాయాత్రను ప్రారంభించారు. అశ్వదళ ఊరేగింపుతో శోభాయాత్ర సాగింది. శోభాయాత్రలో సిక్కులు అస్త్రం, కర్రలతో పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బ్యాండ్ మేళాలతో, గురు ద్వారా నుంచి ప్రారంభమైన శోభాయాత్ర పెద్దబజార్, పోస్టాఫీస్, నెహ్రూపార్క్, గాంధీచౌక్, దేవిరోడ్ మీదుగా శంకుని గుడి, బోధన్ మార్కెట్, బురుడుగల్లి, గాజుల్‌పేట్ మీదుగా గురుద్వారా వరకు సాగింది.

బోధన్‌లో..

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలో శుక్రవారం గురునానక్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ పట్టణంలోని రైల్వేట్రాక్ పక్కనే ఉన్న సిక్కు మతస్థుల గురుద్వార్‌లో సిక్కుల గురువు గురు నానక్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిక్కు మత స్థాపకుడైన గురునానక్ కార్తీక పౌర్ణమి రోజు జన్మించాడని అందుకనే ఆయన పుట్టిన రోజును సిక్కులు వైభవంగా జరుపుకుంటారన్నారు. బోధన్‌లోని గురుద్వార్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలు రాష్ట్ర ప్రభుత్వాలు గురు నానక్ జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాయన్నారు.


బోధన్ గురుద్వార్‌లో

నాన్ టీచింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముప్కాల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాయంలో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు స్పెషల్ ఆఫీసర్ వినోద్ శుక్రవారం తెలిపారు. పాఠశాలలో హెడ్ కుక్ పదో తరగతి, అసిస్టెంట్ కుక్‌కు ఏడవ తరగతి, నైట్ ఉమెన్ వాచ్‌మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకునేవారు పదో తరగతి చదివి ఉండాలన్నారు. ఈ నెల 19 లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె తెలిపారు.

వ్యవసాయ శాఖ మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మార్క్‌ఫెడ్ చైర్మన్

ఆర్మూర్‌రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు 71వ జన్మదినం పురస్కరించుకొని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని సెక్రెటరియేట్ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును శుక్రవారం మార గంగారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా దేవమ్మ శావ ఊరేగింపు

నందిపేట, నవంబరు15: మండల కేంద్రంలో శుక్రవారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దేవమ్మను గోదావరి నదికి గంగాస్నానానికి తరలించారు. ముందుగా ఖుద్వాన్‌పూర్ రోడ్డులో ఉన్న దేవమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి డప్పు వాయిద్యాల మధ్య దేవతా మూర్తులను బజార్‌కొత్తూర్, ఉమ్మెడ గ్రామ శివారుల మీదుగా గోదావరి నదికి తరలించారు. అక్కడ గంగాస్నానం అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ప్రసాద వితరణ చేసి భిక్షాటన ప్రారంభించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ప్రతీ సంవత్సరం కార్తీక మాసంలో దేవమ్మను గంగాస్నానానికి తరలిస్తున్నట్లు వీడీసీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సదర్‌లు ఏర్రం అల్లకొండ మురళి, మచ్చర్ల చిన్న సాయిలు, నారాయణ, సభ్యులు ఏర్రం సాగర్, పెద్దోల్ల శంకర్, రాజు, లింగం, కృష్ణ, ద్యావతి లింగం, ద్యావతి మురళి తదితరులు ఉన్నారు.

చేపూర్‌లో ఘనంగా భీమన్నదేవుని ఉత్సవాలు

ఆర్మూర్‌రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో ఆదివాసీ నాయకపోడు ఆరాధ్యదైవం భీమన్న దేవుని కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమన్న దేవునికి స్వామివారి కల్యాణం, యజ్ఞం, ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం నిర్వహించారు. భీమన్నదేవుని ఉత్సవాలను పురస్కరించు కొని, ఆలయ 16వ వార్షికోత్సవం సందర్భంగా మేడిపల్లి గంగాధర్ స్మారకార్థం కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయక పోడు సంఘం అధ్యక్షుడు గాండ్ల రాంచందర్, జిల్లా సబ్‌జైలర్ ఆనంద్, మాజీసర్పంచ్ సత్యనారాయణ, అయ్యప్ప శ్రీనివాస్, సాయిబాబాగౌడ్, చేపూర్ గ్రామ సంఘఅధ్యక్షుడు మేడిపల్లి గిరిష్, భూమన్న పాల్గొన్నారు.

ఆయిల్‌పాంతో అధిక లాభాలు

ముప్కాల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆయిల్‌ఫాం ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని మండల ఉద్యవన శాఖ అధికారి రుద్ర వినాయక్ తెలిపారు. శుక్రవారం ముప్కాల్ మండలంలోని నాగంపేట్ గ్రామంలో ఉద్యనవ శాఖ ప్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉద్యనవన శాఖ అధికారి రుద్రవినాయక్ మాట్లాడుతూ ప్రస్తుత ఆయిల్‌పాం ధర రూ.19వేల144 ధర ఉందని, రూ..20వేల వర కు దాటే అవకాశం ఉందని, రైతులు ఆయిల్‌ఫాంపై అవగాహన పెంచుకొని ఆయిల్‌పాం సాగుకు ముందుకురావాలని ఆయన సూచించారు. ఆయిల్‌పాం సాగు చేస్తున్నప్పటి నుంచి 30నెలల వరకు వచ్చిన పూతను నెలను తొలగించాలని రైతులకు సూచించారు. 2022లో ఆయిల్‌పాం నాటి రైతులు 2025నాటికి దిగుబడి వస్తుంది. డిసెంబర్ నెలలో రైతులకు అందుబాటులోకి గెలాల సేకరణ కేంద్రాన్ని అందుబాటులోకి తేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అధికారులు, నాగంపేట్, కొత్తపల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థుల ఎంపిక

జక్రాన్‌పల్లి, నవంబర్ 15 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు తొర్లికొండ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న అండర్ -17 బాలుర విభాగంలోశ్రీహరి, శశికుమార్, బాలికల విభాగంలో గంగోత్రి, సరితలు ఎంపికైనట్టు వ్యాయమ ఉపాధ్యాయుడు గంగామోహన్ తెలిపారు. ఈనెల 14న ఆర్మూర్, సుద్దపల్లిలో జరిగిన ఉమ్మడి జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్-17 బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన తొర్లికొండ విద్యార్థులు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. నిర్మల్ జిల్లాలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు జరిగే 68వ స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలలో విద్యార్థులు పాల్గొంటారని ఆయన తెలిపారు. శుక్రవారం జక్రాన్‌పల్లిలో ఎంపికైన విద్యార్థులను ఎంఈవో శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు గంగామోహన్, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్తీక.. జ్యోతులు!!



● ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



● నీల కంఠేశ్వర ఆలయంలో స్వామివారి దర్శనం కోసం క్యూకట్టిన మహిళా భక్తులు



● ఆలయ ఆవరణలో దీపాలతో ముగ్గులు వేస్తున్న మహిళలు

నీలకంఠేశ్వర ఆలయంలో కార్తీక పూజలు





● ఓం ఆకారంలో దీపాలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం నీలకంఠేశ్వర ఆలయంలో ఘనంగా కార్తీక పూజలు నిర్వహించారు. ఆలయంలో దేవతా మూర్తులకు అర్చకులు వేదమంత్రాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయంలో జరిగిన కార్తీక పూజలో భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాల్గొని పూజించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో జరిగిన ఆకాశ దీపంలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు మకరంద్ శాఖాయ్, సుహాస్ శాఖాయ్‌లు ఆకాశ దీపానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకాశ దీపాన్ని ధ్వజారోహనం చేయగానే ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీరాం రవీందర్‌గుప్త, అర్చకులు నీలేష్, భక్తులు పాల్గొన్నారు.



● ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపాన్ని వెలిగిస్తున్న అర్చకుడు, పక్కనే ఆసక్తిగా చూస్తున్న భక్తులు









● దీపాలు వెలిగిస్తూ.. ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కమనీయం.. కార్తీకం!!



శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

త్రివేణి సంగమం వద్ద కార్తీక శోభ

రెంజల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రం భక్తులతో కార్తీక శోభను సంతరించుకుంది. శుక్రవారం కార్తీక పౌర్ణమి కావడంతో త్రివేణి సంగమ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించి నదిలో తెప్పలు వదిలి మొక్కులు తీర్చుకున్నారు. గోదారమ్మకు మహా హారతిని సమర్పించి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక మాసంలో శివుడికి అత్యంత ప్రీతికరమైన మాసం కావడంతో శివునికి పూజలు చేస్తే సర్వ పాపాలు తొలగిపోతాయని భక్తులు గోదావరి పరివాహక ప్రాంతమైన కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రానికి అధిక సంఖ్యలో వచ్చి శివాలయంలో పూజలు చేసి గంగా స్నానం ఆచరించి కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం నిర్వహించారు.



గోదావరికి మహా హారతి ఇస్తున్న దృశ్యం



త్రివేణి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

భక్తికి నిలయం.. శ్రీకేదారేశ్వర ఆశ్రమం

- నాడు పలుగుట్ట, తెల్లవాలు గుట్టగా నామకరణం
- పలు రాష్ట్రాల నుంచి తరలివస్తున్న భక్తులు
- 35 ఏళ్లుగా మంగి రాములు మహరాజ్ దీక్ష
- నందిపేట మండలంలో నేటి జాతరకు ఏర్పాట్లు పూర్తి

నందిపేట, నవంబరు 15: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న పలుగుట్ట ఆలయం రోజురోజుకూ ప్రసిద్ధి చెందుతోంది. పలుగు రాళ్ల గుట్ట కాస్త.. పలుగుట్టగా.. ఆ తర్వాత శ్రీకేదారేశ్వర ఆశ్రమంగా పేరొందింది. రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, కేరళ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. 1987లో వెలిసిన ఆలయం రోజురోజుకూ భక్తులను ఆకర్షిస్తునే ఉంది. ఆశ్రమం వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్ 35ఏళ్లుగా దీక్ష చేస్తున్నారు. ప్రతీ సంవత్సరం దసరా(విజయదశమి) రోజు దీక్షలోకి వెళ్లి, కార్తీక పౌర్ణమి రోజున దీక్ష విరమిస్తారు. మరుసటి రోజున జాతర జరుగుతుంది. బాలయోగి మంగి రాములు మహరాజే ప్రతీ భక్తుడికి విభూది పెట్టి ఆశీర్వదిస్తారు. అదేరోజు అన్నదానం కొనసాగుతుంది. సుమారు 40వేల నుంచి 50వేల భక్తులు ఇందులో పాల్గొంటారు.

ఆశ్రమ దర్శనం







● ఆశ్రమంలోని శివాలయం, పక్కన గర్భగుడిలో లింగం | ..సాయిబాబా మందిరం | నవ గ్రహాల స్తూపం



● పూర్వపు చరిత్ర ఇదీ..

మెదక్ జిల్లా దుబ్బాక మండలం పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన మంగి సాయిలు-లక్ష్మమ్మ దంపతులు. వీరికి నలుగురు కొడుకులు. చిన్న కొడుకు రాములు 1969లో జన్మించారు. బతుకు తెరువు కోసం నందిపేట మండల కేంద్రానికి వలస వచ్చారు. విఠలేశ్వర ఆలయం ప్రక్కనే ఉన్న బ్రాహ్మణ ఇంట్లో తల్లి లక్ష్మమ్మ పాచిపని (అంట్లు తోమడం) చేస్తుండేది. రాములు పశువుల కాపరిగా పనిచేసేవాడు. ఒకరోజు పలుగుట్ట ప్రాంతంలో పశువులు కాస్తుండగా ఒక దివ్యపురుషుడి దర్శనం కలిగింది. ఆరోజు ఆయన చేతిలో ఉన్న అరటి పండ్లను భుజించమని రాములుకు ఇచ్చారని, అవి తిన్న తర్వాత ఎనలేని బలం వచ్చి పెద్ద పెద్ద బండరాళ్లను(ప్రొక్లెయినర్‌తో తీయరానివి) ఆయన చేతి మహిమతో పైకి ఎత్తారని చెప్తారు. అందుకే రాములు మహ రాజ్‌కు భగవంతుని అనుగ్రహం లభించిందని చెప్పుకుంటారు. ఆ రాములే నేటి బాలయోగి మంగి రాములు మహరాజ్. ఆ దివ్య పురుషుడి అనుగ్రహంతో ఐదు రోజుల పాటు రోజుకు రెండు అరటి పండ్లు, 1 గ్లాసు పాలతో బ్రాహ్మణుడి ఇంట్లో దీక్షకు దిగారు. అనంతరం అయిలాపూర్‌లోని చంద్రమౌళీశ్వర మఠములో బ్రాహ్మణ గురువుతో ఉపదేశం తీసుకున్నారు. అప్పటి నుంచి 12ఏళ్ల పాటు 41 రోజులు పాటు వివిధ దీక్షలు చేపట్టారు. మొదటి దీక్షా 27.07.1987లో ప్రారంభమై జూలై 31కి పూర్తయ్యింది. దీక్షలో ఉన్న రోజుల్లో రోజుకు ఒక గ్లాసు పాలను మాత్రమే సేవించేవారు. అమావాస్య, పౌర్ణమికి భక్తులకు మహరాజ్ దర్శనం ఇచ్చేవారు.



ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్

● నేతలు, ప్రముఖుల తాకిడి

ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు నుంచి మాజీ ఎంపీలు కేశ్‌పల్లి గంగారెడ్డి, ఆత్మచరణ్‌రెడ్డి, మాజీ స్పీకర్ కేఆర్ సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఏలేటి అన్నపూర్ణమ్మ, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలితలు ఎన్నికల సమయంలో మంగి రాములు మహరాజ్ ఆశీస్సులు తీసుకుంటారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన తర్వాతే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారంటారు. అలాగే గెలుపొందిన ప్రజాప్రతినిధులు బాధ్యతలు స్వీకరించగానే ఆశ్రమంలో కొరత ఉన్న వాటికి నిధులు కేటాయించడం పరిపాటి. దివంగత తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక సలహాదారులు ధర్మపురి శ్రీనివాస్, మాజీ ఎంపీ మధుగౌడ్ యాష్కిలు పలుమార్లు ఆలయాల్లో పూజలు చేసి రాములు మహరాజ్ ఆశీస్సులు తీసుకున్నవారిలో ఉన్నారు. కాగా, మంగిరాములు మహరాజ్ విజయదశమి 12.10.2024 రోజున ఉదయం 10:15 గంటలకు దీక్ష ప్రారంభించారు. 15.11.2024 రోజున అర్ధరాత్రికి దీక్షను విరమిస్తారు. అనంతరం గోదావరి నదిలో గంగాస్నానం చేసి భక్తులకు దర్శనమిస్తారు. మరుసటి రోజున అనగా 16.11.2024న జాతర కార్యక్రమాలు, అన్నదానం చేస్తారు.

● జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

జాతర ఉత్సవాలకు ఆశ్రమం నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్ సందేశం ఇవ్వడానికి స్టేజీని ఏర్పాటు చేశారు. భక్తులు క్యూ కట్టడానికి బారీకేడ్లు నిర్మించారు. అన్నదానం చేయడానికి సామగ్రిని సమకూర్చారు. సేవలు చేయడానికి విద్యార్థులను నియమించారు. రెండు చోట్ల వాహనాలకు పార్కింగ్ స్థలాలను కేటాయించారు.

● శాశ్వత కార్యక్రమాల వివరాలివీ..

అన్నం పరబ్రహ్మ స్వరూపం అనే నానుడిని నిజం చేయడానికి ఆశ్రమం నిర్వాహకులు పథకం రూపొందించారు. ప్రతీరోజు అన్నదానం జరుగుతోంది. నిత్య అన్నదానం పథకంలో చేరదలచిన భక్తులు రూ1,116 చెల్లించాలి. అలాగే శ్రీకామేశ్వర సిద్ధి మండపం నిర్మాణం కోసం ఫీటుకు రూ555 చెల్లించాలి. చెల్లించిన వారికి ప్రతీ సంవత్సరం క్యాలెండర్‌ను ఇంటికి పంపిస్తారు. అంతేకాకుండా ఆదిలాబాద్ జిల్లా ముథోల్ మండలం బాసర గ్రామంలో పుష్కర ఘాట్ రోడ్డుకు శ్రీకేధారేశ్వర శ్రీఅన్నపూర్ణమాత నిత్య అన్నదాన ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా, భూదానం, భవన నిర్మాణం కోసం భక్తులు ఒక్కొక్కరు రూ.5,116 చెల్లిస్తున్నారు.

బస్సు ఎక్కాలంటే.. ఎన్ని కష్టాలో!

● కోటగిరిలో ప్రయాణికులకు తప్పని తిప్పలు

కోటగిరి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారుల ఉదాసీనత కారణంగా కోటగిరి ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. వానొచ్చినా.. ఎండలు మండినా.. రోడ్లపైన నిలబడాల్సిందే. కూర్చోడానికి కాస్తంత జాగా లేదు. చంటి పిల్లలు, వృద్ధుల పరిస్థితి మరి దారుణం. రోడ్డుపైనే బస్సులు ఆపుతుండడంతో ట్రాఫిక్ కష్టాలు పెరుగుతున్నాయి. కోటగిరి మండల కేంద్రంలో మూడు దశాబ్దాల క్రితం గ్రామానికి దూరంగా రూ.5లక్షల వ్యయంతో బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. నాటి నుంచి నేటి వరకు అక్కడికి వెళ్లిన ప్రయాణికులు లేరు. ప్రస్తుతం ఆ బస్టాండ్ శిథిలావస్థకు చేరింది. పాత బస్టాండ్ కోటగిరి మండల కేంద్రానికి ప్రధాన కూడలి. ఇక్కడ ఉన్న బస్టాండ్ సైతం ప్రయాణికులకు అనుకూలంగా లేదు. శిథిలావస్థకు చేరగా బస్టాండ్ ప్రాంగణమంత ఆటోలకు, పాన్ డబ్బాలకు, మొబైల్ షాపులకు నిలయంగా మారింది. ఈ ప్రాంతం నుంచే బోధన్, పొతంగల్, ఎత్తొండ, బస్వాపూర్, బీర్కూర్, బిచ్కుంద, జుక్కల్ ప్రాంతాలతో పాటు మహారాష్ట్రలోని దెగ్లూర్ వైపు వెళ్లే ప్రయాణికులు వాహనాల కోసం ఎదురు చూస్తుంటారు. పాత బస్టాండ్ శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. గంటల పాటు రోడ్డుపై నిలబడే ఉంటున్నారు. అంతేకాకుండా కూడలిలలో వ్యాపార సముదాయాల ముందు మహిళలు నిలబడితే ఆకతాయిలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులకు నీడ సౌకర్యం లేక అసౌకర్యానికి గురవుతున్నారు. మరో వైపు రోడ్డుపై బస్సులు నిలపడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

దృష్టి సారిస్తే ప్రయోజనం

ప్రస్తుతం బస్సులు నిలిచే చోట చిన్నపాటి ప్రాంగణం ఉంది. ఈ ప్రాంగణం ప్రయాణికులకు ఎలాంటి ఉపయోగకరంగా లేదు. బోధన్, పొతంగల్ రహదారిపై ప్రస్తుతం సంత నిర్వహించే ప్రాంగణం విశాలంగా ఉంది. ఇరిగేషన్ శాఖకు చెందిన ఈ స్థలంలో కొందరు షెడ్లను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. మరి కొంత స్థలంలో సంత కొనసాగుతుంది. ఈ స్థలాన్ని వినియోగంలోకి తీసుకువస్తే ప్రయాణికులకు మేలు చేకూరనుంది. ముఖ్యంగా పాత బస్టాండ్ మరమ్మత్తుకు ఇటీవల 15 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఇరిగేషన్ స్థలంలో బస్టాండ్ నిర్మిస్తే ప్రయాణికులకు మేలు జరిగే అవకాశం ఉంది. మహిళలకు సైతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణం సాఫీగా సాగే ఆస్కారం ఉంటుంది.

బోధన్ డిపోకు భారీ ఆదాయం

బోధన్ డిపోలో బోధన్, నిజామాబాద్, బోధన్, బాన్సువాడ రూట్ తర్వాత బోధన్, పొతంగల్ రూట్ డిపోకు ప్రధాన ఆదాయంగా ఉంది. డిపో నుండి రోజుకు సుమారు 60 ట్రిప్పుల బస్సులు తిరుగుతున్న ప్రయాణికులకు మాత్రం కనీస వసతులు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమవుతోంది. కోగిరి మండల కేంద్రంలో పాలిటెక్నిక్, జూనియర్ కళాశాలలు ఉండగా నిత్యం వందలాది మంది విద్యార్థులు ఇతర ప్రాంతాల నుంచి కోటగిరి బస్సుల ద్వారా ప్రయాణాన్ని కొనసాగిస్తుంటారు. ప్రజలు, విద్యార్థులు ప్రయాణం సాగించే కోటగిరి మండలకేంద్రంలో ప్రయాణ ప్రాంగణం కరువైంది. ఆర్టీసీ ఉన్నతాధికారులు బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జర దేఖో!!



● కోటగిరి మండలకేంద్రంలో రోడ్డుపై నిలబడిన ప్రయాణికులు

కొనుగోళ్లు మొదలైనా రైతులకు తప్పని తిప్పలు

(5వ పేజీ తరువాయి..)

తరలిస్తున్నారు. ఎక్కడైనా ఇబ్బంది ఉంటే వాటిని పరిష్కరించడంతో పాటు గన్నీ బ్యాగులు, వాహనాలను సమకూర్చుతున్నారు. హమాలీల కొరత ఉన్నచోట ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి కొనుగోలు జరిగే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లుకు వెళ్లగానే ట్రక్ షీట్ ఆధారంగా ట్యాబ్ ఎంట్రీని కొనుగోలు కేంద్రాల వారు చేస్తున్నారు. మద్దతు ధర ప్రకారం రైతులు అమ్మిన ధాన్యానికి అనుగుణంగా వారి ఖాతాల్లో డబ్బులను జమ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.106 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. బోనస్ మాత్రం తర్వాత రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు సన్నరకం ధాన్యం అమ్మిన రైతుల వివరాలను పౌరసరఫరాల శాఖ వారికి పంపిస్తారు. ఆ వివరాల ఆధారంగా ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి రైతుల ఖాతాల్లో క్వింటాలుకు 500 రూపాయల బోనస్‌ను జమ చేస్తారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేశామని పౌరసరఫరాల సంస్థ డీఎం అంబాదాస్ రాజేశ్వర్ తెలిపారు. జిల్లాలో ప్రతీరోజు 20వేల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలను తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు అనుగుణంగానే ట్యాబ్ ఎంట్రీ చేసి రైతుల ఖాతాల్లో ప్రతీరోజు డబ్బులను జమ చేస్తున్నామని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా కొనుగోళ్లలో రైతులు ఇబ్బందులు పడితే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తున్నామని ఆయన తెలిపారు.

గాడి తప్పుతున్న పోలీసు శాఖ

(5వ పేజీ తరువాయి..)

రెండు నెలల్లోనే ఉమ్మడి జిల్లాకు తిరిగి వచ్చారు. తమకు నచ్చిన స్టేషన్‌లో పోస్టింగ్ వచ్చే విధంగా చూసుకున్నారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టిన ప్రజాప్రతినిధుల అండదండలతో వారు అనుకున్న స్థానాల్లో పోస్టింగ్‌లను పొందుతున్నారు. కొంతమందికి సామాజిక సమీకరణాలు కూడా ప్రజాప్రతినిధుల ద్వారా కలిసి వస్తున్నాయి. దానికి అనుగుణంగానే పోస్టింగ్‌లు తీసుకుంటున్నారు. ప్రభుత్వం మారి కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఈ విధానం మారడం లేదు.

పదేళ్లలో మారిన పరిస్థితి

పోలీస్ శాఖలో పదేళ్ల క్రితం పూర్తిస్థాయిలో నిఘా వర్గాల నివేదికను తీసుకోవడంతో పాటు పనిచేసే అధికారులపై కీలకమైన స్టేషన్‌లను ఇచ్చేవారు. బదిలీలతో పాటు పైరవీలకు తావివ్వకుండా శాంతిభద్రతలను పర్యవేక్షించే వారికి అవకాశం కల్పించేవారు. లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎక్కువ మొత్తంలో కేసుల సంఖ్యను బట్టి కీలకమైన అధికారులను కేటాయించేవారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు, సున్నితమైన ప్రాంతాలు, గొడవలు జరిగే ప్రాంతాలు, సరిహద్దు స్టేషన్లు, దొంగతనాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ఆ రంగాల్లో ఎక్కువగా పనిచేసిన అధికారులకు ఈ పోస్టింగ్‌లను ఇచ్చేవారు. రౌండ్ ది క్లాక్ పర్యవేక్షించడంతో పాటు ఆ స్టేషన్ల పరిధిలో ఎలాంటి గొడవలు జరుగకుండా చూసేవారు. గత పదేళ్లుగా పరిస్థితి మారింది. ప్రజాప్రతినిధులు చెప్పిన వారికే పోస్టింగ్‌లను ఇస్తున్నారు. కీలకమైన ఆపరేషన్‌లో పాల్గొన్న వారికి కూడా లా అండ్ ఆర్డర్‌లో పనిచేసేందుకు అవకాశం రావడం లేదు. సమర్థవంతమైన అధికారులను కూడా లూప్‌లైన్ పోస్టుల్లో వేస్తున్నారు. ఆర్టీసి, ట్రాన్స్‌కో, సిఐడి, ఇంటిలిజెన్స్, ఎస్ఐబి, ఇతర విభాగాల్లో నియమిస్తున్నారు. కొన్ని కేసుల్లో వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న వారికి కూడా ప్రజాప్రతినిధుల సిఫారసులతో లా అండ్ ఆర్డర్ పోస్టులను ఇస్తున్నారు. లూప్‌లైన్‌లో పనిచేస్తున్న వారికి ఏళ్ల తరబడి లా అండ్ ఆర్డర్ పోస్టులు ఇవ్వడం లేదు. మండల స్థాయి, డివిజన్ స్థాయిలో పనిచేసే అధికారులకు ఎమ్మెల్యేలు, మంత్రులు, కీలక నేతల సిఫారసుల మేరకే ఈ పోస్టింగ్‌లను ఇస్తున్నారు. నిక్కచ్చిగా పనిచేసే అధికారులను పట్టించుకోవడం లేదు. నిఘా వర్గాలు ఇచ్చిన నివేదిక ప్రకారం చర్యలు తీసుకోవడం లేదు. ఇసుక, మట్టి, బియ్యం అక్రమ రవాణా, భూకబ్జా కేసుల్లో ప్రమేయం ఉన్న అధికారులకే ఎక్కువగా మంచి పోస్టులను ఇస్తున్నారు. ప్రభుత్వం మారిన వారికే కీలకమైన స్థానాలు దక్కాయి.

నిర్ణయాలు అమలు చేయలేకపోతున్నాం..

ఉమ్మడి జిల్లా పరిధిలో సమర్థవంతమైన అధికారులే జిల్లా స్థాయిలో బాధ్యతలు నిర్వహిస్తున్నా కొన్ని సమయాల్లో వారి నిర్ణయాలను అమలు చేయడం వీలు కావడం లేదు. బదిలీల్లోనేతలు జోక్యం ఎక్కువగా చేసుకోవడం వల్ల కీలకమైన అధికారులకు పోస్టింగ్‌లు దక్కడం లేదు. వివాదాస్పదమైన అధికారులకే వత్తాసు ఉండటంతో ఎక్కువగా పోస్టింగ్‌లు పొందుతున్నారు. కొన్నిసార్లు సీపీ, ఎస్పీలు బదిలీలలో వివాదాస్పదమైన వారిని మినహాయించి కొత్త వారికి ఇచ్చిన కొద్దిరోజుల్లోనే ఒత్తిళ్లతో తిరిగి వస్తున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన పైరవీలతో ఉమ్మడి జిల్లా పరిధిలోకి వచ్చి చేరుతున్నారు. కొన్నిసార్లు కీలకమైన నిర్ణయాలు కూడా పక్కనబెట్టాల్సిన పరిస్థితి ఉన్నతాధికారులకు ఎదురవుతుంది.

ఇంకా కొత్త సీపీని నియమించలేదు..

నిజామాబాద్ జిల్లా పరిధిలో కమిషనర్ బదిలీ అయి నెల రోజులు దగ్గర పడుతుంది. ఇప్పటి వరకు కొత్త వారిని నియమించలేదు. ఎక్కువ మంది అధికారులు పోటీ పడటం వల్ల నిర్ణయం తీసుకోలేదు. కీలకమైన జిల్లాలో ఉన్నతాధికారులు లేకపోవడం వల్ల శాంతిభద్రతలు పర్యవేక్షించడం ఇబ్బందిగా మారింది. కామారెడ్డి జిల్లా ఎస్పీకి ఇంచార్జి బాధ్యతలను అప్పచెప్పిన పూర్తిస్థాయిలో పర్యవేక్షించే అవకాశం లేదు. జిల్లా సీపీగా వచ్చేందుకు ఐపీఎస్‌లు ప్రయత్నాలు చేస్తున్నా అనుకూలమైన అధికారిని తెచ్చుకునేందుకు నేతలు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. ఐపీఎస్‌ల బదిలీల్లో సమర్థవంతమైన అధికారిని జిల్లాకు నియమిస్తే వివాదాలు కొంత మేరకు తగ్గే అవకాశం ఉంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆర్మూర్‌రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెర్కిట్, బాల్కొండ, మెండోర, ముప్కాల్ మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాల అంతరాయం కలుగుతుందని పెర్కిట్ ఏడీఈ శ్రీనివాస్, ఏఈ మౌనిక ఒక ప్రకటనలో తెలిపారు. పెర్కిట్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చేపూర్, ఫత్తేపూర్, పెర్కిట్, మగ్గిడి, బాల్కొండ మండలంలోని బోదేపల్లి, జలాల్‌పూర్, ముప్కాల్ మండలంలోని నల్లూర్, కొత్తపల్లి, వేంపల్లి, ముప్కాల్, మెండోర మండలంలోని ఎల్కటూర్, పోచంపాడ్, మెండోర గ్రామాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సబ్‌స్టేషన్‌లో పరిధిలో వివిధ మరమ్మత్తులు, నిర్వహణలో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని వారు కోరారు.

విజయ డెయిరీ పాలను వాడండి

● హోటల్ యజమానులకు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచన


నిజామాబాద్ అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నడుపుతున్న విజయ డెయిరీ పాలను ప్రతి ఒక్కరు వినియోగించాలని కల్తీలేని పాలను వాడటం వల్ల ఆరోగ్యాలు బాగుంటాయని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో నగరంలోని హోటల్ యజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం కల్తీపాలు వస్తున్నాయని దానివల్ల పిల్లలతో పాటు పెద్దల వరకు అందరి ఆరోగ్యాలు పాడవుతున్నాయని కావున ప్రభుత్వ రంగ సంస్థ అయిన కల్తీలేని విజయ డెయిరీ పాలను వినియోగిం చడం వల్ల పాడి రైతులను ప్రోత్సహించవచ్చన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయ డెయిరీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని సారంగపూర్‌లో విజయ డైరీకి కొత్త మిషనరీతో పాటు కొత్త భవన నిర్మాణానికి 5 కోట్లు మంజూరు చేశారని అన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో దొరుకుతున్న పాల వల్ల అనేక ఇబ్బందులు వస్తున్నాయని చిన్నపిల్లలు సైతం రోగాల బారిన పడుతున్నారని కావున ప్రతి ఒక్కరు కల్తీలేని విజయ డెయిరీ పాలను వాడాలన్నారు. గత ప్రభుత్వం విజయ డెయిరీని నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. రైతులను ప్రోత్సహించడంతో పాటు వారికి లాభాలు అందించేలా విజయ డెయిరీని ప్రోత్సహించాలని ఆయన హోటల్ యజమానులను కోరారు. హోటళ్లకు అవసరమైన అన్ని ఉత్పత్తులను అందుబాటులో ఉంచడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర రైతు కమీషన్ మెంబర్ గడుగు గంగాధర్, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంఘాల చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశవేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నరాల రత్నాకర్, నగేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కల్తీపాలతో క్యాన్సర్

బోధన్‌రూరల్: కల్తీ పాలతో చిన్నారులకు, ప్రజలకు క్యాన్సర్ వ్యాధి వస్తుందని, ప్రజలు నాణ్యమైన పాలను వినియోగించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో కౌన్సిలర్‌లతో, మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ పాల వల్ల క్యాన్సర్ బారిన ప్రమాదముందని అధ్యయనాల్లో వెల్లడైందన్నారు. ప్రజలు గృహాల్లో సైతం విజయ డెయిరీ పాలను వినియోగించి ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కౌన్సిలర్లు శరత్ రెడ్డి, పిట్ల సత్యం, శ్రీకాంత్, డబ్బు, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

బాపూజీ వచనాలయ నూతన భవన నిర్మాణం అభినందనీయం

నిజామాబాద్ అర్బన్: నగరంలో దశాబ్దాల చరిత్ర కలిగిన బాపూజీ వచనాలయానికి నూతన భవన నిర్మించడం అభినందనీయమని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాన్ని పరిశీలించారు. పాత భవనం పురాతనంగా మారినందున నూతన భవన నిర్మాణం చేపట్టడం గొప్ప విషయ మని ఆయన కమిటీ సభ్యులను అభినందించారు. నూతన భవన నిర్మాణానికి జిల్లాలోని నాయకులంతా కృషి చేస్తున్నారని తనవంతుగా రూ.10లక్షలు అందజేస్తానన్నారు. ఆయన వెంట ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, బాపూ జీ వచనాలయ చైర్మన్ భక్తవత్సలం, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, కోశాధికారి గంగాధర్, కార్యవర్గ సభ్యులు లక్ష్మినారాయణ, మీసాల సుధాకర్‌రావు, భోగ అశోక్, మహిపాల్‌రెడ్డి, లక్ష్మంరెడ్డి పాల్గొన్నారు.



హోటల్ యజమానులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి



బాపూజీ వచనాలయ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సుదర్శన్‌రెడ్డి

ఉర్దూఘర్, షాదీఖానాను అభివృద్ధి చేస్తాం

బోధన్‌రూరల్: పదేళ్ల కాలంలో బోధన్‌లో ఉన్న ఉర్దూఘర్‌కు చేసిందేమి లేదని శిథిలావస్థ దశకు చేరిందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బోధన్‌లోని ఉర్దూఘర్, షాదీఖానాకు అన్ని విధాలుగా అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన అన్నారు. శుక్రవారం ఉర్దూఘర్ నూతన కమిటీ కార్యవర్గాన్ని ప్రకటించి నియామకపత్రాన్ని అందజేశారు. అధ్యక్షులుగా లియాకత్ హుస్సేన్(బ్యాటరీ బాబా), ఉపాధ్యక్షులుగా షేక్.వహీద్, సెక్రెటరీగా ఎండీ.ఖుర్షిద్, సభ్యులుగా ఏజాజ్ హుస్సేన్, సయ్యద్ నసీర్, షేక్.హజర్, సిరాజుద్దీన్, తాహెరా బేగం, కన్వీనర్‌గా తహసీల్దార్ విఠల్‌లను నియమిస్తూ నియామకపత్రాలను అందజేశారు. ఉర్దూఘర్ పరిసరాలను పరిశీలించారు. ఉర్దూఘర్ ప్రాంగణంలో ఉన్న మడిగెలను ఖాళీ చేయించి షాదీఖానాకు తోడ్పడేలా కృషి చేయాలని నూతన కమిటీని ఆదేశించారు. అనంతరం రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ ఉర్దూ అకాడమీ ద్వారా 15 లక్షల రూపాయల నిధులు ఉన్నాయని గౌరవ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి 15లక్షలు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఉర్దూఘర్ అభివృద్ధి చేస్తే మరిన్ని నిధులు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గౌసోద్దీన్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

పరమేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా పరమేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్ర, నియోజకవర్గ ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు చేశామన్నారు. బోధన్ చక్రేశ్వర ఆలయానికి చారిత్రాత్మకమైన విశిష్టత ఉందని, భక్తుల కోర్కెలు నెరవేర్చే కొంగు బంగారంగా బోధన్ శివాలయం విరాజిల్లుతుందన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ఉదయం నుండి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, అర్చకులు గణేష్ మహరాజ్, శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి పాల్గొన్నారు.

యువత సుప్రియను ఆదర్శంగా తీసుకోవాలి: ఎమ్మెల్యే

సాలూర మండలం మందర్నా గ్రామానికి చెందిన చెన్న పవర్ నాగనాథ్ పటేల్ కూతురు సుప్రియ గ్రూప్-4 ఉ ద్యోగాలలో మైనారిటీ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సోసైటీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించినందుకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరం యువత సుప్రియను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలి

● అదనపు కలెక్టర్ అంకిత్

డిచ్‌పల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య పాఠశాలలో చదువు తున్న విద్యార్థులు చక్కగా చదివి ఉన్నత స్థానాల్లో రాణించాలని ప్రతీ ఒక్కరు దర్తీ బాబా భగవాన్ బిర్సా ముండా అడుగు జాడల్లో నడుచుకోవాలని అదనపు కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. బిబిపూర్ తండా శివారులో గల గిరిజన పాఠశాల రెసిడెన్సి స్కూల్‌లో 150వ బిర్సా ముండా జయంతి వేడుకల్లో ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్‌తో కలిసి అదనపు కలెక్టర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారా జాతి కోసం ఎన్నో సామాజిక సేవలు చేస్తూ బంజారాలను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్లిన బిర్సా ముండా సేవలు మరువలేనివని 36 సంవత్సరాలకే జాతి కోసం కష్టపడి ఆయన సజీవ సమాధి అయ్యారని గుర్తు చేశారు. జల, జంగల్, జమీన్ నిజాం సర్కారుకు ఆదివాసుల హక్కుల పోరాటంపై పోరాటం చేసిన కుమ్రం భీమ్ జాతి చరిత్రను మరువకూడదని ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్ పేర్కొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్‌ను బంజారా నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా పశుసంవర్ధక శాఖ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగోరావు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఆర్‌సివో, తుకారాం, లీడ్ బ్యాంక్ మేనేజర్ శేషారావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు అదనపు కలెక్టర్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.



ఏకలవ్య పాఠశాలలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

అయ్యప్ప స్వామి ఆలయంలో మండల పూజ

నవీపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో మండల పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో గణపతి పూజ, నవ విధ అభిషేకాలు, పూల అలంకరణ, గోపూజ, హోమగుండ ఆవిర్భావం, హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆలయంలో మహాపడిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

కోటగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలో అయ్యప్ప, సాయిబాబా ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు శుక్రవారంతో రెండవ రోజుకు చేరుకున్నాయి. అఖండ నామస్మరణ, భజన కార్యక్రమాలు పెద్ద ఎత్తున కొనసాగాయి. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రుద్రూర్‌లో ఘనంగా రుక్మిణీ, పాండురంగ కల్యాణం

కోటగిరి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో శుక్రవారం రుక్మిణీ, పాండురంగ కల్యాణ మహోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పండరిపూర్ సంప్రదాయాన్ని అనుసరించి గత నెల రోజులుగా ఆలయ అర్చకులు రామశర్మ కులకర్ణి, పవన్ శర్మ ఆధ్వర్యంలో కాకడ హారతి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ముగింపు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.




రుద్రూర్‌లో కల్యాణ వేడుకలు

వైభవంగా రామాలయ పవిత్రోత్సవాలు

● హాజరైన దేవనాథ జీయర్ స్వామి

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆలయాలకు పవిత్రతను చేకూర్చే పవిత్రోత్సవాలను సుభాష్‌నగర్ రామాలయంలో వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా వివిధ యజ్ఞ క్రతులు నిర్వహించిన ఆచార్యులు శుక్రవారం పూర్ణాహుతితో పవిత్రోత్సవాలను ముగించారు. ఆలయంలో జరిగిన పవిత్రోత్సవాలకు దేవనాథ జీయర్ స్వామి హాజరై ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి స్వామీజీ మాట్లాడుతూ ప్రతి యేటా దేవాలయాల్లో పవిత్రోత్సవాలను నిర్వహించడం ద్వారా లోక కల్యాణం జరుగుతుందన్నారు. ఆలయాల పవిత్రతను కాపాడేందుకే ఈ ఉత్సవాలను నిర్వహించడం సాంప్రదాయంగా వస్తుందని అన్నారు. హైందవ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూనే విస్తృతపరుస్తూ ఆలయాలకు పూర్వవైభవాన్ని అందించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. అనంతరం పూర్ణా హుతి జలాలతో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలకు అభి షేకాలను అర్చకులు తులసీ మురళీధరాచార్య రాఘవాచార్య నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో యజ్ఞాచార్యులు సముద్రాల శ్రీధరాచార్య, కందాళై నర్సింహమూర్తి, గోపాలచార్య, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రవచనం చేస్తున్న స్వామీజీ

మోడల్ పాఠశాలలో వ్యాసరచన పోటీలు

డిచ్‌పల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్రం నిజామాబాద్ వారి ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మోడల్ పాఠశాలలో బిర్సా ముండా జయంతి సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శుక్రవారం జాతీయ గౌరవ దివాస్ సందర్భంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు వ్యాసరచన పోటీలో పాల్గొన్నారు. పోటీలో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నెహ్రూ యువ కేంద్రం ప్రతినిధులు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

నిజామాబాద్ కల్చరల్: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రస్తుత టెక్నాలజీ విద్యా విధానం అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో విద్యార్థులు సృజనాత్మకతతో ఉత్సాహంగా పోటీలో పాల్గొన్నారు.

వ్యానును లారీ ఢీకొట్టడంతో ఒకరి మృతి

మోపాల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లారం గండిలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ గోపాల్ (53) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై మహ్మద్ ఆరీఫ్ తెలిపారు. వాన్సువాడ నుంచి నిజామాబాద్ వైపు వస్తున్న ఓమిని వ్యాన్‌కు నిజామాబాద్ నుంచి బాన్సువాడ వైపు వెళ్తున్న బీడీల లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఓమిని డ్రైవర్ అక్కడికక్కడే మరణించాడు. ఈ ప్రమాదం జరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని తెలిపారు.



మృతి చెందిన గోపాల్

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

● ప్రయాణికులు సురక్షితం

సుభాష్‌నగర్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసి బస్సు అదుపు తప్పింది. రోడ్డు నుంచి పక్కకు వెళ్లడంతో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకున్నా డ్రైవర్‌కు అనారోగ్యంకు గురికావడంతో బస్సు పక్కకు వెళ్లినట్లు తెలిసింది. నిజామాబాద్ డిపో-1కు చెందిన ఏపి25జెడ్01006 నెంబర్‌గల బస్సు దుబ్బాక నుంచి నిజామాబాద్‌కు వస్తుండగా బైపాస్ రోడ్‌లో అదుపుతప్పి రోడ్డు పక్కకు వెళ్లింది. బస్సులో సుమారు 20 మంది ప్రయాణికులు ఉన్నారు. వారి ఒక్కరికి మాత్రమే కొద్దిపాటి గాయాలు అయ్యాయి. బస్సు పక్కకు వెళ్లడంపై డిపో-1 అధికారులు విచారణ చేపట్టారు. కారణాలను తెలుసుకొని డ్రైవర్ అజాగ్రత్త వల్ల జరిగిందా నిజంగానే డ్రైవర్ అనారోగ్య కారణాల వల్ల జరిగిందా అనేది విచారిస్తున్నారు.



రోడ్డు పక్కకు వెళ్లిన బస్సు

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.245	రూ. 265
వెన్‌కాబ్(కిలో)	రూ.150	రూ.255	రూ. 275

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.76900	రూ.71130	రూ.930

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కంగువా (3డి తెలుగు) (9.30, 12.50, 4.10, 7.30, 10.50)
స్క్రీన్-2 : మట్కా (12.10, 3.35, 7.00, 10.25)
స్క్రీన్-3 : అమరన్ (11.45, 6.30)
: గ్లాడియేటర్-2 (తెలుగు) (3.15)
: గ్లాడియేటర్-2 (ఇంగ్లీష్) (10.00)
స్క్రీన్-4 : క (1.00)
: లక్కీ భాస్కర్ (4.15, 7.30)
: అమరన్ (10.45)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : అమరన్ (10.25)
: లక్కీ భాస్కర్ (1.40, 7.35)
: మట్కా (4.35, 10.40)
స్క్రీన్-3 : కంగువా (తెలుగు 3డి) (10.20, 1.25, 4.30, 10.40)
: అమరన్ (7.30)

దేవి : మట్కా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : అమరన్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కంగువా (3డి తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్